క్లుప్తంగా

గోరంట్ల ఆర్‌ఐగా సోమశేఖర రెడ్డి

గోరంట్ల: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా సోమశేఖరరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఈయన సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండలానికి ఆర్‌ఐగా బదిలీ అయ్యారు.

భవనాల తొలగింపు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

హిందూపురం: రైల్వే ఫీడర్ రోడ్డు విస్తరణలో భాగంగా మిగిలిన భవనాల తొలగింపు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్‌ఎఫ్ రోడ్డు విస్తరణ పనులను టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. భవన యాజమానులతో మాట్లాడి, పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. అలాగే ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌ను సంప్రదించాలన్నారు. రోడ్డుకు ఇరువైపునా కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. రైల్వే రోడ్డు విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

బడి బస్సు నడపాలని వినతి



ఆర్టీసీ సీఐ హంపన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్/పరిగి: పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లికి బడి బస్సు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ సీఐ హంపన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడారు. శ్రీరంగరాజుపల్లి, గౌర్రిపల్లి, బిందునగర్, సేవామందిరం గ్రామాల నుంచి విద్యార్థులు చదువుకునేందుకు పట్టణానికి వస్తున్నారన్నారు. బస్సులు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కళాశాలలు ప్రారంభం కావడంతో గతంలో నడిపిన బడి బస్సులను పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హర్ష కుమార్, భగత్, వినోద్, రామాంజి, సాయి, మహేష్, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రలేఖనం పోటీలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న న్యాయమూర్తులు

పావగడ: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చిన్మయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన చిత్రలేఖనం పోటీలు ఆకట్టుకున్నాయి. తుమకూరు రోడ్డులోని సాలమరద తిమ్మక్క ఉద్యానవనంలో పర్యావరణంపై నిర్వహించిన పోటీలకు సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక జేఎంఎఫ్‌సీ న్యాయమూర్తులు హరణి శ్రీకాంత్, రవీంద్ర కుమారి, విస్మిత మూర్తి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్మయ సంస్థ వ్యవస్థాపకుడు సత్యలోకేశ్, వ్యాయామ శిక్షణ అధికారులు బసవరాజు, సీఆర్పీలు మూర్తి, పవన్ కుమార్ రెడ్డి, శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



విద్యార్థికి కిట్ అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. శనివారం మండలంలోని కెంకెర ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 130 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాయ మండల ఇన్‌చార్జ్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం శాంతమూర్తి పాల్గొన్నారు.

మెళవాయి పంచాయతీ కార్యదర్శిగా శివభాస్కర్

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయి పంచాయతీ కార్యదర్శిగా శివభాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఈఓఆర్డీ శైలజ తెలిపారు. ఈయన లేపాక్షి మండలం నుంచి బదిలీపై వచ్చారని పేర్కొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- నాలుగేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు
- చంద్రబాబువి మోసపూరిత హామీలు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంకరనారాయణ



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శంకరనారాయణకు తొలుత గ్రామస్తులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందించారు. పద్నాలుగేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. కేవలం ఆయన కుమారుడు లోకేష్‌ను సీఎం చేయడానికి తాపత్రాయ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. గడిచిన నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలే కాకుండా ఇవ్వని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు..

చంద్రబాబు, టీడీపీ నాయకులు అధికార దాహంతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తుల మోసపూరిత మాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఇళ్లు, పింఛన్, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీ స్వామి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ సరస్వతి, ఏపీఎం దేవానంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్, గంగరాజు, యోగానందరెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్టం)
హిందూపురం: 35.0
పెనుకొండ : 38.0
మడకశిర : 35.0

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి 3 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి సభ్యుడు డాక్టర్ బసవరాజు శనివారం తెలిపారు. ఈ శిబిరానికి బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి నుంచి వైద్యులు వస్తారన్నారు. గుండె, మూత్రపిండాల సమస్యలు, నరాల నొప్పి, వెన్నునొప్పి, మెడ నొప్పి తదితర సమస్యలతో బాధపడే వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు టోకెన్లు అందజేస్తామని పేర్కొన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో..

గుడిబండ: స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మడకశిరకు చెందిన డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజల ముంగిటకే రిజిస్ట్రేషన్ సేవలు



రెడ్డిపల్లిలో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి

రొద్దం: ప్రజల ముంగిటకే రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం తీసుకొచ్చిందని జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి అన్నారు. శనివారం మండల పరిధిలోని రెడ్డిపల్లి సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామాంజినమ్మ, సబ్ రిజిస్ట్రార్ నల్లప్ప, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా పనులు పూర్తి చేయాలి



హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న జలసాధన సమితి నాయకులు

మడకశిర: హంద్రీ-నీవా కాలువ పెండింగ్ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని జల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు గుడిబండ, మడకశిర మండలాల్లో పర్యటించి హంద్రీ-నీవా కాలువ పనులను పనులను పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. హంద్రీ-నీవా పెండింగ్ పనులను పూర్తి చేసి ఐదు మండలాల్లోని 165 చెరువులను కృష్ణాజలాలతో నింపాలన్నారు. 13,500 ఎకరాలకు సాగు నీరు అందించాలని కోరారు. రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్లను నీటితో నింపాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను వెడల్పు చేయాలని సూచించారు. అదే విధంగా కాలువలో పూడిక తీసి కంప చెట్లను తొలగించాలని తెలిపారు. రైతులకు సాగు నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జల సాధన సమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రాష్ట్ర ఓపీడీఆర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు నవీన్, సోమ్‌కుమార్, నర్సేగౌడు, హనుమంతరాయప్ప, గోవిందప్ప, పీడీఎస్‌యూ నాయకులు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




కేక్ కట్ చేస్తున్న కమిషనర్, స్కూల్ నిర్వాహకులు

హిందూపురం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పంచజన్య బ్రిలియంట్ స్కూల్ 21వ వార్షికోత్సవాన్ని ఆ స్కూల్ అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరుపుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ ఉపాధ్యక్షుడు సందీప్, కార్యదర్శి నందకుమార్, డైరెక్టర్ భారతి, సత్య, ఏడీ స్మిత, ఏఓ విజయభాస్కర్, ఎంఈఓ గంగప్ప, హెచ్ఎం గాయిత్రి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గోరంట్ల: అడిగినంత డబ్బు ఇవ్వలేదని స్టోర్ డీలర్‌ను కులం పేరుతో దూషించిన ఓ విలేకరిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు.. 5 నెలల క్రితం సీమ వార్త విలేకరి ఈశ్వర రాయల్ మండల పరిధిలోని పులేరు గ్రామానికి వెళ్లాడు. స్టోర్ డీలర్ కిష్టప్పను కలిసి మీ స్టోర్‌లో అధిక ధరలకు సరుకులు విక్రయిస్తున్నావంటూ బెదిరించాడు. ఈ విషయాన్ని ప్రచురించకుండా ఉండాలంటే నెలకు రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయపడిన కిష్టప్ప రెండు విడతలుగా రూ. 4 వేలు ఇచ్చాడు. ఈ క్రమంలోనే కిష్టప్ప ఈనెల 14న గోరంట్లకు వచ్చాడన్న విషయం తెలుసుకున్న ఈశ్వర రాయల్ అతడి దగ్గరికి వెళ్లి బెదిరింపు ధోరణితో మాట్లాడాడు. కులం పేరుతో దూషించాడు. డబ్బులడిగితే వాయిదాలు వేస్తావా, నీ అంతు చూస్తా అంటూ బెదిరించాడు. కిష్టప్ప ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త త్రిలోచన శాస్త్రి

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు సమీపంలోని రైతు సహకార వేరుశనగ మిల్లులో శనివారం శ్రీసత్యసాయి రైతు పరస్పర సహాయక పరిమిత సమాఖ్య వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ మండలాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త త్రిలోచన శాస్త్రి మాట్లాడుతూ.. సహకార పరిమిత సమాఖ్య ద్వారా రైతులకు ఉత్తమ సేవలందిస్తున్నట్లు తెలిపారు. దళారి వ్యవస్థకు చోటు లేకుండా లాభాలను రైతులకు పంచుతామన్నారు. రైతు సమాఖ్యను పరిశీలించేందుకు మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి ఎన్‌జీఓ ప్రతినిధులు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు వెంకటగిరిపాళ్యం అశ్వర్థరెడ్డి, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, సమాఖ్య సభ్యులు, వ్యవసాయ శాఖ ఏడీఏ స్వయం ప్రభ, ఏఈఓ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం/అమరాపురం/సోమందేపల్లి/మడకశిర/లేపాక్షి/రొళ్ల/పెనుకొండ/రొద్దం: ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, అర్హులకు పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శనివారం హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హిందూపురంలోని టీటీడీ కళ్యాణ మండపంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన వలంటీర్లు, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పరిశీలనకు నోచుకొని సమస్యలకు 24 గంటల్లో పరిష్కరం చూపాలన్నారు. అర్హులైన వారికి ఆగస్టు నుంచి అర్హత పత్రాలు పంపిణీ చేయాలన్నారు. సంక్షేమ ఫలాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులను అమరాపురం ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న ఆదేశించారు. ఈనెల 23 నుంచి జూలై 23వ తేదీ వరకూ ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా ఆరా తీయాలని సూచించారు. వలంటీర్ల ద్వారా వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటామని రొద్దం తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం అవుతాయని పెనుకొండ మండల స్పెషల్ ఆఫీసర్ పద్మావతి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని రొళ్ల ఎంపీడీఓ ఆజాద్ సచివాలయ సిబ్బందికి సూచించారు. వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై వివరించాలని లేపాక్షి ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని మడకశిర ఎంపీడీఓ సోనిబాయి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి అన్నారు. శనివారం సోమందేపల్లిలోని వెలుగు కార్యాలయంలో ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు పొందడానికి అవసరమయ్యే ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టాపర్లకు పురస్కారాల ప్రదానం



రొద్దం: పురస్కారం అందుకుంటున్న హేమలత





శృజిత, గంగోత్రికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, కలెక్టర్ అరుణ్‌బాబు

చిలమత్తూరు: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన పి.శృజితకు శనివారం పుట్టపర్తిలో పురస్కారం అందజేశారు. స్థానిక బైరేకుంట వద్ద ఉన్న కేజీబీవీలో ఇంటర్ చదివిన శృజిత 1000 మార్కులకు గాను 936 మార్కులు సాధించింది. రూ.50 వేలు నగదు, మెడల్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీ పాఠశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థుల్లో శృజిత అత్యధిక మార్కులు సాధించిందని ఎస్ఓ రెహానా తెలిపారు.

టేకులోడు ఎంజేపీ బాలికల పాఠశాలలో..

మండలంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల పాఠశాల విద్యార్థిని గంగోత్రి 10 తరగతిలో 586 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. త్రిష 581 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్ రెడ్డి తెలిపారు. కళాశాల విభాగంలో బైపీసీ గ్రూప్‌లో ఆదిలక్ష్మి 982 మార్కులు సాధించి ప్రథమస్థానంలో, ఎంఈసీలో చందన 972 మార్కులతో రెండవ స్థానం, భార్గవి 967 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారన్నారు. వీరందరూ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెడల్స్, నగదు అందుకున్నారని పేర్కొన్నారు.

సత్కారం..

రొద్దం: తురకలాపట్నం జెడ్పీ పాఠశాల విద్యార్థిని కురుబ హేమలత శనివారం పుట్టపర్తిలో కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా 584 మార్కులతో జిల్లా స్థాయిలో మూడో బహుమతి దక్కించుకున్న హేమలతను ఉపాధ్యాయులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన సుధాకర్

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం వద్ద శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. సీ కొడిగేపల్లి గ్రామానికి చెందిన వలంటీర్లు సుధాకర్, నరేష్, లక్ష్మీపతి ద్విచక్ర వాహనంలో మడకశిరకు బయలుదేరారు. బుళ్లసముద్రం వద్ద రోడ్డు పక్కన గ్యాస్ పైప్‌లైన్ పని జరుగుతుండటంతో అక్కడ ఏర్పాటు చేసిన భారీకేడ్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. సుధాకర్‌కు ఎడమ చేయి విరగడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

కారును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం



గాయపడిన నరసింహప్ప

అమరాపురం: మడకశిర రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆగి ఉన్న కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. వివరాలు.. అనిల్‌కుమార్ గౌడనకుంట నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు కారులో బయలుదేరారు. అమరాపురంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మడకశిర రోడ్డులో తన కుమారుడు బహిర్భూమికి వెళ్లేందుకు కారు ఆపారు. అమరాపురం వైపు నుంచి హాలుకూరు వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న నరసింహప్ప ఆగి ఉన్న కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు అద్దాలు పగలడంతో పాటు కారు కింది భాగం దెబ్బతింది. నరసింహప్ప తల, చేతికి గాయాలయ్యాయి. అతడ్ని చికిత్స నిమిత్తం స్థానిక గుండేగౌడ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తుమకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ప్రారంభం

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శనివారం ఆ సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, రీజినల్ కో-ఆర్డినేటర్ రంగనాయకులు మాట్లాడారు. నిరుపేదల అభివృద్ధికి ఆర్డీటీ చేయూతనందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ నాగసుదర్శన్ రెడ్డి, ఎంఈ రామకృష్ణ, సీసీ రామకృష్ణ, సీడీసీ ఈశ్వర్ పాల్గొన్నారు.

120 ఎకరాల్లో మొక్కల పెంపకం

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 62 మంది రైతుల పొలాల్లో సుమారు 120 ఎకరాల్లో మొక్కల పెంపకం చేపట్టినట్లు ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. రైతు పొలాల్లో మొక్కల పెంపకానికి తీస్తున్న గుంతలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. ఇప్పటికే 35 ఎకరాల్లో గుంతలు తీశారని తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, జామ, అల్ల నేరేడు, సీతాఫలం, చింత, డ్రాగన్‌ఫ్రూట్ తదితర మొక్కలను సాగు చేసుకోవచ్చన్నారు. సాగు చేసిన మొక్కలను సంరక్షించుకోవడానికి రైతుకు పైసా ఖర్చు ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వమే మూడు సంవత్సరాల పాటు బిల్లులు చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన మొక్కలను అందించి పెంపకాన్ని ప్రోత్సహిస్తామని వెల్లడించారు. మొక్కల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఇంక ఎవరైనా మొక్కలు పెంపకం చేపట్టే రైతులు ఉంటే సోమవారం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

సందడిగా గ్రాడ్యుయేషన్ డే

లేపాక్షి: మండలంలోని కల్లూరు, లేపాక్షి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డి రమణమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, సర్పంచ్ వసుంధర, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పాతకక్షలతోనే హత్యాయత్నం

హిందూపురం అర్బన్: పాతకక్షల నేపథ్యంలోనే చంద్రశేఖర్ అనే వ్యక్తిపై హత్యాయత్నం జరిగినట్లు ఎస్ఐ అబ్దుల్ కలాం తెలిపారు. హిందూపురం రూరల్ మండలంలోని సంతేబిదనూరులో శుక్రవారం రాత్రి చంద్రశేఖర్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన సురేష్ కత్తితో గొంతు కోసి, కత్తితో పొడిచిన విషయం విదితమే. 24 గంటలు కూడా గడవకమునుపే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మాట్లాడుతూ తీవ్రగాయాలపాలైన చంద్రశేఖర్ ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నట్టు తెలిపారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని సంజీవరాయునిపల్లి గ్రామ శివారులోని పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకున్నామరు. మరో ఇద్దరు పారిపోయినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.18 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

యోగాపై ర్యాలీ

హిందూపురం: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సంతేబిదనూర్ యోగా శిక్షకురాలు, ఆయుర్వేద డాక్టర్ అనూరాధ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంతేబిదనూర్‌లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. రోజూ యోగా, ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

హిందూపురం అర్బన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేద్దామని మాజీ ఏజీపీ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కూరగాయాల మార్కెట్ ఆవరణలో బాలకార్మిక నిర్మూలన వ్యవస్థపై అదనపు మెజిస్ట్రేట్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, కృష్ణమూర్తి, లోక్‌అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే వేగవంతం చేయండి

గుడిబండ: భూ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ నాగభూషణం సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సమగ్ర భూ సర్వేను రైతులతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే మండలంలో రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్లు మహబూబ్ పీరా, రాంభూపాల్ రెడ్డి, ఆర్ఐ బిలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

హిందూపురం అర్బన్: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం పట్టణంలోని భగీరథ కూడలిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తున్న మోడల్ కాలనీకి చెందిన రియాజ్, రహమత్‌పూర్‌కు చెందిన వీరాంజనేయులును అరెస్ట్ చేశారు. వారి నుంచి 250 మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ భాస్కర ప్రసాద్‌రాజు తెలిపారు.

డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలరాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. కళాశాలలో 170 మంది పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యం తాము కళాశాల నడపలేమని చేతులెత్తేసిందన్నారు. విద్యార్థుల చదువు పూర్తయ్యే వరకూ కళాశాల నడపాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు

పెనుకొండ: నైపుణ్యాలు పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో శనివారం సమతా స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, ఏఓ కేశవయ్య ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం, వాటి ఉత్పత్తి, శుద్ధి చేయడం, ప్యాకింగ్, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.